క్లుప్తంగా

అల్లీనగర్‌ను ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలి

గ్రామస్తుల డిమాండ్



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని అల్లీనగర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శనివారం అల్లీనగర్ గ్రామస్తులు భారీ ర్యాలీ చేపట్టారు. ఇటీవల గ్రామస్తులపై పోలీసుల దాడులు చేయటం, గ్రామకంఠం స్థలంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడాన్ని నిరసించడంతో పాటు అల్లీనగర్‌ను పంచాయతీ చేయాలనే డిమాండ్‌తో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేస్తే అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకుంటామన్నారు. గ్రామకంఠం భూములను పరిశ్రమలకు కేటాయిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎంపీ అశోక్, వార్డుసభ్యుడు వీరేశంగౌడ్, నాయకులు బాలుగారి శ్రీనివాస్, బాలయ్య, కార్తీక్, అర్జున్, భాస్కర్, గోపాల్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, వికలాంగులు

జిన్నారం(పటాన్‌చెరు): వికలాంగులకు అందజేస్తున్న పింఛన్‌ను పెంచేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవటంతో జిన్నారంలో బీఆర్ఎస్ నాయకులు వికలాంగులతో కలిసి శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, శ్రీధర్‌గౌడ్, నర్సింగ్‌రావు, వీరేశ్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాల సందర్శన



కళాశాల సిబ్బందితో తహసీల్దార్ పద్మావతి

హత్నూర(సంగారెడ్డి): హత్నూరలోని గురుకుల కళాశాలలో విద్యార్థులకు సక్రమమైన సౌకర్యాలు లేవని కలెక్టర్‌కు ఫిర్యాదు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసిల్దార్ పద్మావతి శనివారం కళాశాలను సందర్శించిన విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గురుకుల కళాశాలలో 20 మరుగుదొడ్లకు 10 మాత్రమే పని చేస్తున్నాయని, మరో 10 మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. వీటిపై ఉన్నతాధికారులకు సైతం ప్రిన్సిపాల్ లేఖ రాసినట్లు తెలిపారు. విద్యార్థులకు భోజనం, సౌకర్యాలు, ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నట్లు, విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని తహసిల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వివేకానంద పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కంగ్టి మండల పరిధిలోని తుర్కావడ్‌గాంకు చెందిన వార్డుసభ్యులు దిలీప్‌తో పాటు నాయకులు సోమనాథ్, మోషప్ప, రమేష్, సచిన్, ఆకాష్, రాజు తదితరులు కాంగ్రెస్ పార్టీ నుంచి శనివారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తిలో చర్చి నిర్మాణానికి రూ.5లక్షలు, హనుమాన్ మందిరం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.3లక్షలు మంజూరు చేసినందుకు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాజ్‌కుమార్, నాయకులు గణపతి, యోహాన్ పూలమాలలతో సన్మానించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన దుర్గయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దుర్గయ్య అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నగదును స్థానిక సర్పంచ్ మురళి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

లక్ష్యంలేని చదువు వ్యర్థం

ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్



విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యంతో చదవాలని, లక్ష్యం లేని చదువు వ్యర్థమని ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. మన సమాజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఎంజీ మినీ ఫంక్షన్ హాల్‌లో పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు, పుస్తెమెట్టెలు, వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పరీక్షల ప్యాడ్లు, ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్న మన సమాజం ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. ఎంఈఓ అంజయ్య మాట్లాడుతూ నిరంతర విద్యార్థి నిజ జీవిత విజేతగా ఎదుగుతారన్నారు. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో మన సమాజం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మడుపతి మహేష్ స్వామి, ఉపాధ్యక్షులు మఠం రాచన్నస్వామి, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కోశాధికారి సంతోష్‌కుమార్, గౌరవ సలహాదారులు చక్రేశ్వర్, శ్రీనివాస్, కరుణాకర్, రవీందర్, హరీశ్‌కుమార్, మల్లికార్జున్, విజయ్‌కుమార్, కేదర్‌నాథ్, యాదగిరి, శివప్రసాద్, మల్లేశం విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పరస్పర రాజీతో ఇరుపక్షాలకు న్యాయం'



నారాయణఖేడ్: మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్ మథాని

నారాయణఖేడ్: లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు పరస్పర రాజీతో కేసులు పరిష్కరించుకుంటే ఇరుపక్షాలు గెలిచినట్లేనని నారాయణఖేడ్ జూనియర్ సివిల్‌జడ్జీ కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మథాని అన్నారు. నారాయణఖేడ్ కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కక్షలు, కార్పణ్యాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండటంతో పాటు కోర్టుల్లో కేసుల భారం ఉండకూడదనే ఉద్దేశంతో లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్‌అదాలత్‌లకు మంచి స్పందన వచ్చిందని తెలిపారు. 432 కేసులను పరిష్కరించగా అందులో సివిల్ కేసులు రెండు కాగా.. భూవివాదాలకు సంబంధించిన సివిల్ కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు అధికసంఖ్యలో వచ్చారు. న్యాయవాదులు నర్సారెడ్డి, భోజిరెడ్డి, మారుతిరెడ్డి, లక్ష్మణ్‌రావు, సుధాకర్, నాథేన్‌ద్యాని, మినాజ్, సుదర్శన్, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రేసీబెరిల్ పాల్గొన్నారు.

జోగిపేటలో 150 కేసుల పరిష్కారం

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిఫ్ కోర్టులో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్‌అదాలత్‌లో 150 కేసులు పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి తెలిపారు. కోర్టు పరిధిలోని జోగిపేట, పుల్కల్, అల్లాదుర్గం, టేక్మాల్, వట్‌పల్లి మండలాలకు సంబంధించి సీసీ కేసులు 5, సీసీ ఎక్సైజ్ కేసులు 3, సివిల్ పార్టిషన్‌లు 1, ఎస్‌టీసీ అడిమిషన్ కేసులు 13, సీసీ అడ్మిషన్ కేసులు 1, పీఎల్‌సీ కాంప్రమైజ్ కేసులు 1, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 1 పరిష్కరించినట్లు తెలిపారు. క్షణికావేశంలో చేసిన కేసులను పరిష్కరించుకోవాలని పోలీసుశాఖ వారు సూచించిన కేసులకు మంచి స్పందన లభించిందన్నారు. లోక్‌అదాలత్ ద్వారా చాలా వరకు కేసులు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణరెడ్డి, పీజే విఠల్‌రెడ్డి, చంటి ప్రభు, అల్లె శ్రీకాంత్, అనిల్‌బాబు, మల్లేశం, వెంకటేశం, వెంకటకృష్ణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 124 కేసులు పరిష్కారం

జహీరాబాద్: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 124 కేసులు పరిష్కారం అయ్యాయి. సివిల్ విభాగంలో 6 కేసులు, క్రిమినల్ విభాగంలో 48 కేసులు, 60 బ్యాంకు పీఎల్సీ, 3 అడ్మిషన్ కేసులు, 7ఎక్సైజ్ కేసులు పరిష్కారం అయినట్లు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.66,62,180 వసూలైనట్లు తెలిపారు.



జోగిపేట: ఉత్తర్వులు అందజేస్తున్న మెజిస్ట్రేట్ ధనలక్ష్మి



జహీరాబాద్‌లో..

ఎల్‌ఓసీ అందజేత

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌కు చెందిన వడ్ల లక్ష్మణ్ భార్య వడ్ల అంబిక కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ అస్పత్రిలో చికిత్స పొందుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స చేయించుకునే స్తోమత లేనందునా స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి ఆర్థికసాయం అందించాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ శనివారం లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. మనో నిబ్బరంతో ఉంటూ చికిత్స చేయించాలని సూచించారు. ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వీరాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ గ్రామ పరిధిలోని హరివిల్లు టౌన్ షిప్ కాలనీలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నితీష‌శ్రీకాంత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఫిష్ ఫెడరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్ర ఫిష్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్‌ను జిన్నారం మండల ముదిరాజ్ మత్స్య సహకార సంఘం నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా మండల మత్స్యసహకార సంఘం చైర్మన్, డైరెక్టర్‌లు పిట్టల రవీందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుంకరబోయిన మహేష్, వెంకటేశం, రాజు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్‌ను హైదరాబాద్‌లో జోగిపేట మాజీ ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయనతోపాటు జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పి.రాజుతో పాటు పలువురు నాయకులు కలిసి సన్మానించారు.



జోగిపేట: పిట్టల రవీందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రేపటి నుంచి సదస్సులు

జహీరాబాద్ టౌన్: రంజోల్ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సులకు సంబంధించి ఈ నెల 12 నుంచి అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కుమారస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్‌లో ఆటోమొబాయిల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, మెకానికల్ ఇంజనీర్ డిప్లొమా కోర్సులు ఉన్నాయన్నారు. ఆయా కోర్సులు పూర్తి చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలు, బీటెక్ వంటి ఉన్నత విద్యకు వెళ్లే అవకాశాలపై సదస్సులో వివరించనున్నట్లు తెలిపారు. 12 నుంచి 14 వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సదస్సు కొనసాగుతుందన్నారు. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులపై ఆసక్తి ఉన్న విద్యార్థులు అవగాహన సదస్సుకు హాజరుకావాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ ఖేడ్ బీఎస్పీ మండల అధ్యక్షుడిగా శంకర్

నారాయణఖేడ్: బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని బాణాపూర్‌కు చెందిన పుప్పాల శంకర్ ఎన్నికయ్యారు. శనివారం ఖేడ్‌లో ఆ పార్టీ ఇన్‌చార్జి మలిగదొడ్డి పండరి, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు పుప్పాల అశోక్ ఆధ్వర్యంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం శంకర్‌ను సన్మానించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

◆ విరాళం అందజేత



జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ రూ.51వేల విరాళాన్ని శనివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. వైస్ ఎంపీపీ గంగు రమేశ్, సర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శివరాజ్, ఉప సర్పంచ్ రవి పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి



పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌తో కలిసి డివిజన్ పరిధిలోని శిశుమందిర్, గోకుల్‌నగర్, పాత మార్కెట్, నిజాందర్గాలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని కార్పొరేటర్‌కు వివరించగా హెచ్ఎండబ్ల్యూఎస్ సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం



నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో కార్మికశాఖ కార్డులు పొందిన వారికి శనివారం జిల్లా సమన్వయకర్త వెంకట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాహుల్ చౌహాన్ సిబ్బందితో కలిసి 125మంది కార్మికులకు ఈసీజీ, పీఎఫ్‌టీ, ఆర్‌బీఎస్, రక్తపోటు, మూత్ర, రక్త పరీక్షలు, మధుమేహం, చూపు, వినికిడి తదితర 25 రకాల పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదీశ్వరాచారి, ఉపసర్పంచ్ రాంచందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి రాములు పాల్గొన్నారు. ఆదివారం సైతం శిబిరం కొనసాగనుండగా పంచాయతీ మదిర గ్రామాలకు చెందిన కార్మికశాఖ కార్డు పొందినవారు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ కోరారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



హత్నూర: మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని మధుర గ్రామ పంచాయతీకి ఉత్తమ పంచాయతీ అవార్డు దక్కింది. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో మంత్రి హరీశ్‌రావు సర్పంచ్ మాధవి నవీన్‌గౌడ్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మధుర గ్రామ పంచాయతీకి ఉత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరి సహకారంతో సంపూర్ణ పారిశుధ్యం పల్లెప్రగతి పనులను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు.

జహీరాబాద్ టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తెలంగాణ సుపరిపాలన దినోత్సవంలో మొగుడంపల్లికి ఉత్తమ ఎంపీపీ అవార్డు దక్కింది. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా జెడ్పీటీసీ అరుణ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



జహీరాబాద్ టౌన్: విద్యార్థికి అడ్మిషన్ పత్రం అందజేస్తున్న ఎంఈఓ బస్వరాజ్

జహీరాబాద్ టౌన్: బడిబాట కార్యక్రమంలో భాగంగా బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తున్నామని మండల విద్యాధికారి బస్వరాజ్ తెలిపారు. బడిబాటలో భాగంగా శనివారం ఓ బాలుడిని పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించామని ఎంఈఓ చెప్పారు. జహీరాబాద్‌కు చెందిన ఎండీ అల్తాఫ్ హైదరాబాద్‌లోని టోలిచౌకి, గోల్‌కొండలోని క్వీన్స్ మేరీ పాఠశాలలో చదువుతున్నాడు. తదనంతరం అల్తాఫ్ బడి మానేసినట్లు గుర్తించి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో అల్తాఫ్‌కు అడ్మిషన్ ఇచ్చినట్లు తెలిపారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షులు రాహుల్ శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలే మొదటి స్థానంలో ఉన్నాయని తెలిపారు.

క్షత్రియ సంఘం భవనానికి స్థలం కేటాయించాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ: పురగిరి క్షత్రీయ కుల సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఆ సంఘం నేతలు సంగారెడ్డి పట్టణంలోని హ్యాండ్లూమ్ చైర్మన్ చింతా ప్రభాకర్‌ను బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా పురగిరి క్షత్రీయ కుల సంఘం భవనానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎకరా స్థలం కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. దీంతో చింతా ప్రభాకర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో పురగిరి క్షత్రీయ సంఘం జిల్లా అధ్యక్షులు హరికిషన్, టౌన్ ప్రెసిడెంట్ అంజయ్య, రిటైర్డ్ ఎస్సై అంజయ్య, శ్రీనివాస్, వెంకటేశం, మాజీ కౌన్సిలర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గాలివానతో విరిగిన విద్యుత్ స్తంభాలు

హత్నూర(సంగారెడ్డి): గాలివానతో చెట్లు విరగడంతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో ఇండ్ల రేకులు కొట్టుకుపోయాయి. మండల పరిధిలోని పన్యాల గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన శ్రీహరి, యాదయ్య, రాములు, విఠల్‌కు చెందిన ఇంటి పైకప్పు రేకులు గాలివానతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరారు.

వర్ష బీభత్సం



విరిగిపడిన చెట్టు కొమ్మలు

కల్హేర్(నారాయణఖేడ్): మండల కేంద్రంలో శనివారం భారీ వర్షం బీభత్సం సృష్టించింది. చుట్టుపక్క గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు వీచాయి. దీంతో పలువురి ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. కరెంటు సరఫరా నిలిచిపోవడంతో రాత్రి వరకు కరెంట్ పునరుద్ధరణ జరుగలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు



గుంతలో పడిన కారు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పస్తాపూర్ చౌరస్తాలో ప్రమాదం పొంచి ఉంది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన చౌరస్తాలో మురుగుకాలువ కోసం పెద్ద గోయ్యితీసి వదిలేయడంతో వాహనాలు ప్రమాదవశాత్తు గుంతలో పడుతున్నాయి. శనివారం ఓ కారు మురుగుకాలువ గుంతలో పడింది. దీంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో పస్తాపూర్ చౌరస్తా ఉంది. బస్‌స్టాప్ కూడా అక్కడే ఉండటంతో ప్రయాణికులు అక్కడే నిల్చుంటారు. ఝరాసంగంకు వెళే వాహనాలు, ఆటోలు అక్కడే ఆగుతాయి. దీంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఇలాంటి ప్రదేశంలో కొన్ని నెలల క్రితం మున్సిపల్ అధికారులు మురుగు కాలువ కోసం జేసీబీలతో గుంతలు తవ్వించి వదిలేశారు. రోడ్డు పక్కన మురుగు కాలువ గుంత ఉందన్న విషయం తెలియక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుంతను పూడ్చివేయాలని పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సుపరిపాలన దినోత్సవం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని చెత్త తరలించే వాహనాలను శుభ్రం చేయించి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ చంద్రారెడ్డి, ఆర్పో శ్రీధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వాహన పూజలో కమిషనర్, కౌన్సిలర్, కార్మికులు